క్లుప్తంగా

నాగమణి కుటుంబానికి ఆర్థిక సహాయం



అల్లిపూడిలో నాగమణి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అల్లిపూడి ఎంపీటీసీ సభ్యురాలు నెమ్మది నాగమణి కుటుంబ సభ్యులకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు నాగమణి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లంక ప్రసాద్, నాయకులు గర్సింగి దొరబాబు, గోవర్ధన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓంకార స్వామి జయంతి వేడుకలు రద్దు



శాంతిఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకార స్వామి

ప్రత్తిపాడు రూరల్: వెంకటనగరం పంచాయతీ పరిధిలోని తోటపల్లి నిర్వహించే శ్రీశాంతి ఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకారస్వామి జయంతి వేడుకలను రద్దు చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే గత నాలుగేళ్లుగా కరోనా, కొన్ని అనివార్య కారణాల వల్ల జయంతి వేడుకలు రద్దవుతూ వస్తున్నాయి. ఈ ఏడాది కూడా తప్పనిసరి పరిస్థితుల్లో జయంతి వేడుకలను రద్దు చేసినట్టు తెలిపారు. భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు గోదా రంగనాథుల కల్యాణం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం గోదా రందనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

సెబ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా, నిందితులతో ప్రత్తిపాడు సెబ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలో గ్రామాల్లో శనివారం విస్తృతంగా దాడులు చేసి సారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం జగపతినగరంలో డ్యూటీ పెయిడ్ లిక్కర్ ఆరు మద్యం సీసాలతో రావుల నాగరాజును, ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఏడు మద్యం సీసాలతో చిలకలపల్లి లక్ష్మిని, లంపకలోవలో 30 లీటర్ల సారాతో వాసంశెట్టి సరస్వతిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముద్రగడ నివాసానికి త్వరలో పవన్ కల్యాణ్

కిర్లంపూడి: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెల 22 లోపు వస్తారని తాడేపల్లిగూడెం జనసేన పార్టీ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి శనివారం బొలిశెట్టి శ్రీనివాస్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం జనసేన పార్టీలో చేరితే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం ముద్రగడతో రహస్య మంతనాలు జరిపారు.

వైభవంగా నీరాటోత్సవం



ప్రత్యేక అలంకరణలో గోదా అమ్మవారు

బోట్‌క్లబ్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదా అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పెళ్లికూతురిని చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం గోదా కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నీరాటోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు.

ఊరూవాడా సంక్రాంతి

- సొంతూళ్లకు వస్తున్న వలస కార్మికులు, ఉద్యోగులు
- కిక్కిరిసిన రైళ్లు, బస్సులు
- రూ.100 కోట్ల వ్యాపారం



తుని మార్కెట్ మెయిన్ రోడ్డులో కోలాహలం

తుని/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయుల నడుమ జరుపుకునేందుకు జనం సొంత ఊళ్లకు చేరుకుంటున్నారు. ఉద్యోగ, వ్యాపార, ఇతర రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన అందరూ కన్నతల్లిలాంటి ఉన్న ఊరుకు ఉత్సాహంగా వస్తున్నారు. రైళ్లు, బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం భోగి పండగ కావడంతో శుక్రవారం కుటుంబ సమేతంగా వెళుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఆర్టీసీ పలు పట్టణాలకు పండగ సర్వీసులను నడుపుతోంది. ఇక ప్రైవేటు బస్సు ఆపరేటర్లు టికెట్ ధరలను రెట్టింపు చేశారు. పండగ ముసుగులో దోపిడి చేస్తున్నారు. త్వరగా గమ్యానికి చేరుకోవాలన్న ఆత్రుతతో ఎంతైనా చెల్లించి వస్తున్నామని పలువురు 'సాక్షి'కి తెలిపారు.

గ్రామాల్లో సందడి

సంక్రాంతి పండగకు పల్లెలు సిద్ధమయ్యాయి. ఇళ్లకు రంగుల వేసి, కొత్త దినసులను సిద్ధం చేశారు. ప్రతి ఇంటిలోనూ కొత్త అల్లుళ్లు, కుమార్తెలు, మనుమల కోసం పిండివంటలను సిద్ధం చేస్తున్నారు. తుని నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణంలో పండగ సందడి నెలకొంది. రంగవల్లికలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కోడిపందేలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పోలీసులు కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నా పందెం రాయుళ్లు బరులను సిద్ధం చేస్తున్నారు. అధికార పార్టీకి నాయకుల పర్యవేక్షణలో పందాలకు



తుని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సమాయత్తం అయ్యారు. నియోజకవర్గం పరిధిలోని 45 పంచాయతీల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. పండగ మూడు రోజుల పాటు అనధికారికంగా అనుమతులు ఇచ్చారు.

మార్కెట్‌లో సందడి

పండగ సమయం కావడంతో తుని పట్టణం జన సంద్రంగా మారింది. వంద గ్రామాలకు ప్రధాన కేంద్రం కావడంతో దుస్తులు, కిరాణా, ఫ్యాన్సీ ఇతర వస్తువుల కోసం జనం తరలివస్తున్నారు. మెయిన్ రోడ్డు జన



పెద్దిపాలెంలో భోగి మంటకు సిద్ధం చేసిన కట్టెలు

సంద్రమైంది. వాహనాల రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకున్నా ప్రజలు ఇబ్బంది పడ్డారు. పంటలు పుష్కలంగా పండడంతో రైతులు పండగకు కొత్త దుస్తులు కొనుగోలు చేశారు. యువత రెడిమేడ్ దుస్తులను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీనికి అనుగణంగా వందల సంఖ్యలో దుకాణాలను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో అన్ని రకాల వ్యాపారాలు కలిపి రూ.100 కోట్ల మేర అమ్మకాలు జరిగినట్టు అంచనా. ఇక ఆది



రాచపల్లిలో హరిదాసుకు దక్షిణం వేస్తున్న చిన్నారులు

వారం భోగి కావడంతో ప్రధాన ప్రాంతాల్లో కలపను సిద్ధం చేశారు. చిన్నపిల్లలు భోగి మంటల కోసం ప్రత్యేక పిడకల దండలను సిద్ధం చేశారు. ఇక రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు శుభాకాంక్షలు తెలిపేందుకు ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పోలీసులు మాత్రం ప్రజలు ఇళ్ల వద్దనే సంబరాలు జరుపుకోవాలని, పేకాట, గుండాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు.

కిక్కిరిసిన రహదారులు

గోకవరం: గ్రామాల్లో సందడి నెలకొంది. పండగను పురస్కరించుకుని శనివారం గోకవరంలో ప్రత్యేకంగా సంత నిర్వహించారు. మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు రావడంతో ప్రధాన రహదారులు కిక్కిరిసాయి. అలాగే ఆర్టీసీ బస్సులు, ఆటోలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఆదివారం భోగిపండగను పురస్కరించుకుని భోగి మంటలు వేసేందుకు చిన్నా, పెద్దా ఏర్పాట్లు చేశారు.

భోగి పండగకు సర్వం సిద్ధం

- కలప సేకరణలో యువకులు నిమగ్నం
- భారీగా భోగిమంటలు వేసేందుకు సన్నాహాలు
- గ్రామాల్లో సంక్రాంతి సందడి



ఏలేశ్వరంలో భోగిమంటకు సిద్ధం చేసిన కలప

ఏలేశ్వరం: భోగభాగ్యాలు కలిగించే భోగి పండగను ఆదివారం వైభవంగా జరుపుకునేందుకు నియోజకవర్గవ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు ముస్తాబయ్యాయి. భోగిమంటలకు కలప వేటలో యువకులు యువకులు నిమగ్నయయ్యారు. గ్రామ పొలిమేరలు, పొలాల్లో పెద్దపెద్ద చెట్ల కొమ్మలు, మానులను తెచ్చి పోగు చేశారు. పిల్లలు తెలవారుజామునే నిద్రలేచి తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి ఆవుపేడతో చేసిన భోగి పిడకలను మంటల్లో వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏలేశ్వరం పట్టణంలోని పెద్దవీధి, పల్లపు వీధి, తోటవీధి, దిబ్బలపాలెం, తదితర ప్రాంతాల్లో మంటలు వేస్తున్నారు. మండలపరిధిలోని లింగంపర్తి, యర్రవరం, పెద్దనాపల్లి, సిరిపురం గ్రామాల్లో ముఖ్య కూడళ్లో భారీ భోగిమంటలు వేయనున్నారు.

గ్రామాల్లో పండగ వాతావరణం

గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పండగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకునేందుకు ప్రజలు రెడీ అయ్యారు. తమ ఇళ్లను శుభ్రం చేసుకొని రంగులతో ముగ్గులు వేశారు. మహిళలు తమ ఇళ్ల వద్ద వాకిళ్లలో వేసిన రంగవల్లులు ఆకర్షణగా నిలిచాయి. గ్రామాల్లో తెల్లవారుజామునే హరిదాసు కీర్తనలతో భక్తిభావం పెంపొందుతోంది.

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- పలు గ్రామాల్లో ప్రజాదీవెన కార్యక్రమం



చినశంకర్లపూడిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు: తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ భరోసా ఇచ్చారు. మండలంలోని చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ గ్రామాల్లో శనివారం రెండోరోజు ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్వతకు ప్రజలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ రామిశెట్టి చినబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, సర్పంచులు ఏపూరి రామారావు, పంది భార్గవి, గుడాల విజయలక్ష్మి, రొంగల నాగేశ్వరరావు, గొనగాల అప్పలరాజు, అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దళే చిట్టిబాబు, సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు
- ఏలూరులో పర్యటన

ప్రత్తిపాడు: వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఏలూరులో శనివారం ఆయన పర్యటించారు. తొలుత గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, మాజీ సర్పంచ్ జామి మాణిక్యం, పార్టీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, పార్టీ నాయకులు



ఏలూరులో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వరుపుల సుబ్బారావు

కొట్టేటి సాయిబాబు, తొగరు చిన్న దాడిశెట్టి రామారావు, ధర్మారావు, సబ్బవరపు వీరబాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన సమాచార హక్కు చట్టం కమిషనర్



సత్యదేవుని సన్నిధిలో సమాచార హక్కు చట్టం కమిషనర్ చెన్నారెడ్డి

అన్నవరం: రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారిని దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ



పెరుమాళ్లపురంలో అయోధ్య రాముని అక్షతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ శ్రేణులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో శనివారం ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భజన సమాజం సభ్యులు కొయ్యా మహేష్, సతీష్, కొయ్యా పవన్ తదితరులు స్వామివారి అక్షతలతో బీచ్‌రోడ్డుపై ర్యాలీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి శ్రీరాముని అక్షతలు, కర పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలిబోయిన శ్రీను, కొయ్యా బాబూరావు, ధనరాజు, ఎ.నాగ వీరబాబు, అనిత, జ్యోతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రత్తిపాడు: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని రౌండు టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జులు వరుపుల సత్యప్రభ, వరుపుల తమ్మయ్యబాబు, ఉమ్మిడి వెంకట్రావు, బీసీ ఐక్యపోరాట సమితి కన్వీనర ఏపూరి శ్రీను, బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఐలాజ్‌కు మద్దతు ప్రకటించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, లిబరేషన్, సీఐటీయూ, మానవ హక్కుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి చిరునామా ఆంధ్రప్రదేశ్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు

కిర్లంపూడి: సంక్షేమాభివృద్ధికి చిరునామా ఆంధ్రప్రదేశ్ అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో ఎంపీటీసీ బండారు ప్రసాద్, వేలంకలో శెట్టి సోమరాజు, సింహాద్రిపురంలో కాళపురెడ్డి పెద్దకాపు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విప్లవాత్మక సంస్కరణలతో సంక్షేమం, అభివృద్ధికి చిరునామగా మార్చారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేరుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ కొనసా



రామచంద్రపురం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

గాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయుడు తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నాయకులు తోట బాబ్జీ, తోట అయ్యన్న, ఓలేటి రాజు, నంది వెంకన్న, పాతంశెట్టి కృష్ణబాబు, దోమాల దొరబాబు, చెరుకు గంగాధర్, తోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ



108 రకాల పిండి వంటలతో అమ్మవారికి సమర్పించిన సారె

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి అమ్మవారికి 108 రకాల పిండివంటలను సారెగా సమర్పించారు. పాత సంచుల వర్తక సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముత్తయిదువులు అమ్మవారికి సారె సమర్పించారు. సాంప్రదాయబద్ధంగా మేళతాళాలు, కావుళ్ల, ఎడ్లబండితో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో వైభవోపేతంగా ఊరేగించారు. వేలాది మంది సారెను తిలకించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి మంగళస్నానం నిర్వహించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో కంకిపాటి జమీలు,



సారెతో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

దాడిశెట్టి విష్ణుచక్రం, ధర్మకర్తలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

ధనుర్మాస ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఏడు గంటలకు గోదారంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దాతల సేవలు ప్రశంసనీయం

ఏలేశ్వరం: దాతల సేవలు ప్రసంశనీయమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక బాలాజీ చౌక్ వద్ద శనివారం ధర్మకర్త గోపు వెంకట్రావు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. దాతలు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిగడం వెంకటేశ్వరరావు,



ఏలేశ్వరంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వరుపుల సుబ్బారావు

సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయికి మేడపాడు కబడ్డీ జట్టు

సామర్లకోట: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా మండల స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు ఫైనల్‌లో పవర-జి.మేడపాడు జట్లు తలపడ్డాయి. పవర జట్టు 16 పాయింట్లు సాధించగా జి. మేడపాడు జట్టు 26 పాయింట్లు సాధించి విజయ ఢంకా మోగించింది. ఈ మేరకు ఈ నెల 25 నుంచి పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ప్రారంభం అయ్యే నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో జి.మేడపాడు జట్టు పాల్గొంటున్నట్టు పీడీ యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. నియోజక వర్గానికి ఎంపికైన కబడ్డీ జట్టును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మొరంపూడి శ్రీరంగ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ అభినందించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై స్వామినాయుడు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలకు ఏర్పాటు చేసిన టెంట్లను శనివారం పోలీసులు తొలగించారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు సంక్రాతి పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.



పందేలు కోసం ఏర్పాటు చేసిన టెంట్లను తొలగిస్తున్న పోలీసులు

ఆడుదాం-ఆంధ్రాకు విశేష స్పందన

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వీరవరం నరసింహం నివాసంలో శనివారం యువ నాయకుడు తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో తోట వేణు, జోకా శ్రీను, తోట బాబ్జీ, ఓలేటి



వీరవరంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న తోట నరసింహం, తోట రాంజీ

రాజు, పాముల వీరబాబు, వెంకట రమణమూర్తి, తోట బాసుమూర్తి, గంగాధర్, అడబాల శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

గోకవరం: అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ నెల 22న విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన ఆధ్వర్యంలో గోకవరం మండలంలో భారీ బైక్ ర్యాలీ చేపడుతున్నట్టు సంఘ వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ బైక్ ర్యాలీ పోస్టర్‌ను శనివారం రాత్రి స్థానిక దేవీచౌక్ ఆలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరంలోని తంటికొండకు వెళ్లే మార్గంలో సీఎండీ కేఎస్‌వీవీ ఫిన్స్ లేఅవుట్ నుంచి చేపట్టే ఈ భారీ బైక్ ర్యాలీ గోకవరం, రంపయర్రంపాలెం, పెంటపల్లి తదితర గ్రామాల మీదుగా సాగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం లేఅవుట్‌లో భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు. అలాగే పలు



గోకవరంలో బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ధార్మిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు వల్లూరి జగన్నాథ శర్మ, శ్రీనివాస్‌శర్మ, సంఘ సభ్యులు వరసాల ప్రసాద్, ఇనకోటి బాపన్నదొర, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, బొమ్మిరెడ్డి తారక్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.